క్లుప్తంగా

హుండీ ఆదాయం లెక్కింపు

పలమనేరు: స్థానిక పాతపేట సత్యగంగమ్మ గుడి హుండీలొఆదాయాన్ని బుధవారం లెక్కించారు. మొత్తం రూ.79,975 ఆదాయం లభించినట్లు అధికారులు తెలిపారు. కార్యక్రమంలో ఆలయ ఇన్‌స్పెక్టర్ శశికుమార్, ఈఓ కమలాకర్, భక్తులు పాల్గొన్నారు.

ఫెన్సింగ్ కూల్చి వేశారని ఫిర్యాదు

రొంపిచెర్ల: మామిడితోట చుట్టూ వేసుకున్న ఫెన్సింగ్ కూల్చి వేశారని బాధితుడు జయరాం నాయుడు స్థానిక పోలీసులకు బుధవారం ఫిర్యాదు చేశారు. గానుగచింత పంచాయతీ మద్దిపట్లవారిపల్లెకు చెందిన జయరాంనాయుడుకు ఓబులవారిపల్లె సమీపంలో మామిడితోట ఉంది. తోట చుట్టూ సుమారు రూ.3 లక్షలు ఖర్చు చేసి మూడేళ్ల కిందట ఫెన్సింగ్ వేసుకున్నాడు. అయితే ఓబులవారిపల్లెకు చెందిన మల్లికార్జున, అతని భార్య లక్ష్మీదేవి, తల్లి ముత్యాలమ్మ, కుమారుడు నిఖిల్, కుమార్తె అపర్ణ తదితరులు కలిసి తన మామిడి తోటకు వేసిన ముళ్ల కంచెను కూల్చి వేశారని, సుమారు 3 లక్షల రూపాయల వరకు తనకు నష్టం వాటిల్లిందని వాపోయాడు. నిందితులపై చర్యలు తీసుకుని న్యాయం చేయాలని బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు దర్యాప్తు చేస్తున్నారు.

వైభవంగా గంగమ్మ జాతర



ఆలయానికి పూలగెరిగెలతో వెళ్తున్న భక్తులు

బైరెడ్డిపల్లి: మండలంలోని పాతపేటలో మంగళవారం రాత్రి వైభవంగా గంగమ్మజాతర నిర్వహించారు. అమ్మవారి ఆలయంలో ఉదయం ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. రాత్రి మొక్కుబడులు ఉన్న మహిళలు అమ్మవారి పూలగెరిగెలను మేళతాళాలు, బళ్లారి డ్రమ్స్, బాణసంచా మోత హోరు నడుమ పురవీధులలో ఊరేగింపుగా తీసుకెళ్లారు. బుధవారం మధ్యాహ్నం ఆలయం వద్ద ప్రతిష్ఠించి మొక్కులు చెల్లించారు. అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా ఎస్‌ఐ వెంకట నరసింహులు గట్టి బందోబస్తు నిర్వహించారు.

కర్ణాటక మద్యం విక్రేత అరెస్ట్

పెద్దపంజాణి: మండలంలోని మద్దకుంటలో కర్ణాటక మద్యం విక్రయిస్తున్న వ్యక్తిని బుధవారం అరెస్టు చేశారు. ఎస్‌ఐ శ్రీనివాసులు కథనం.. మద్దలకుంట గ్రామానికి చెందిన అంజప్ప ఇంటి సమీపంలో కర్ణాటక మద్యం విక్రయిస్తున్నాడనే సమాచారంతో అతనిని అదుపులోకి తీసుకుని 20 (90 ఎంఎల్) టెట్రా ప్యాకెట్లను స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసి రిమాండు నిమిత్తం పుంగనూరు కోర్టులో హాజరు పరిచారు.

విద్యార్థుల్లో సాంకేతిక పరిజ్ఞానం పెంపొందాలి

పులిచెర్ల(కల్లూరు): విద్యార్థుల్లో శాస్త్ర పరిజ్ఞానం పెంపొందించుకోవాలని కల్లూరు జెడ్పీ హైస్కూలు హెచ్‌ఎం పోకల తాతయ్య కోరారు. పాఠశాలలో బుధవారం సమగ్రశిక్ష ఆధ్వర్యంలో అగస్త్య ఇంటర్నేషనల్ ఫౌండేషన్ విద్యార్థులకు యాక్టివిటీ బెస్ట్ సమ్మర్ క్యాంపు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రతిఒక్కరూ శాస్త్ర పరిజ్ఞానాన్ని పెంపొందించుకోవాలని తద్వారా వారిలో మానసిక ఉల్లాసాన్ని కలిగించవచ్చన్నారు. ఉపాధ్యాయులు వెంకటసిద్ధులు, రాజేంద్ర, దేవేంద్రనాథ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పాముకాటుకు వ్యక్తి మృతి

పులిచెర్ల(కల్లూరు): పాముకాటుకు వ్యక్తి మృతి చెందాడు. కల్లూరు పోలీసులు తెలిపిన వివరాలు.. వీసీ వడ్డిపల్లెకు చెందిన తేజ(33) భార్యాపిల్లలతో కలిసి ఇంట్లో నిద్రిస్తున్నాడు. బుధవారం తెల్లవారుజామున తేజను పాము కాటు వేసింది. ఆస్పత్రికి అతడిని తరలించేలోపే మరణించాడు. మృతుడి భార్య నందిని ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని కుటుంబీకులకు అప్పగించినట్టు ఎస్‌హెచ్‌ఏ విశ్వనాథం తెలిపారు.

వైఎస్సార్ సీపీ నాయకుడు మృతి



చంగప్ప(ఫైల్)

శాంతిపురం: మండలంలోని ఎంకె. పురం పంచాయతీకి చెందిన వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకుడు టీవీఎస్ చంగప్ప(49) అనారోగ్యంతో బాధపడుతూ బుధవారం మరణించారు. ఆయన మృతదేహానికి ఎమ్మెల్సీ భరత్ నివాళులు అర్పించారు.

పౌరహక్కులపై అవగాహన

పెద్దపంజాణి: పౌరహక్కులపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని తహసీల్దార్ హనుమంతు అన్నారు. బుధవారం మండలంలోని కొళత్తూరులో పౌరహక్కులపై గ్రామస్తులకు అవగాహన కల్పించారు. సర్పంచ్ రవికుమార్, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా తొట్లెమ్మ ఉత్సవాలు

కుప్పం రూరల్: మండలంలో మోట్లచేను గ్రామంలో నిర్వహిస్తున్న 48 రోజుల శ్రీ తొట్లెమ్మ ఉత్సవాలలో భాగంగా 14వ రోజు బుధవారం ఉదయం పూజా కార్యక్రమాలకు చిత్తూరు ఎమ్మెల్సీ భరత్ హాజరయ్యారు. అమ్మవారిని దర్శించుకున్నారు. అలాగే గరిగ చీనేపల్లెలో బుధవారం గంగజాతర వేడుక లు ఘనంగా నిర్వహించారు.

ప్రజల మద్దతు మళ్లీ వైఎస్సార్ సీపీకే

- వచ్చే ఎన్నికల్లో తిరిగి అధికారంలోకి రావడం తథ్యం
- 'గడప గడపకు మన ప్రభుత్వం'లో ఎమ్మెల్యే వెంకటేగౌడ



లబ్ధిదారులకు సంక్షేమ లబ్ధి బుక్‌లెట్లను ఇస్తున్న ఎమ్మెల్యే వెంకటేగౌడ

గంగవరం: నాలుగేళ్ల వైఎస్సార్‌సీపీ పరిపాలనలో రాష్ట్రాన్ని అభివృద్ధి, సంక్షేమ బాటలో నడిపించడంతో పాటు రాష్ట్రంలో ఒక్కో ఇంటికి లక్షల్లో లబ్ధి చేకూర్చిన ఘనత ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డికే దక్కుతుందని ఎమ్మెల్యే వెంకటేగౌడ స్పష్టం చేశారు. బుధవారం మండలంలోని గుండుగల్లు గ్రామ సచివాలయ పరిధిలో బొమ్మనపల్లె, గంగాపురంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని ఎమ్మెల్యే నిర్వహించారు. ఎమ్మెల్యే ఇంటింటికీ వెళ్లి ప్రజలతో మాట్లాడారు. ఆయా కుటుంబాల్లో వ్యక్తులు పొందిన సంక్షేమ పథకాల లబ్ధిని బుక్‌లెట్లతో వివరించారు. ఆయన మాట్లాడుతూ, ఇచ్చిన హామీలను నెరవేర్చిన చరిత్ర ముఖ్యమంత్రి జగనన్నదైతే, అధికారంలో ఉన్నంత కాలం హామీలను నెరవేర్చని హీన చరిత్ర చంద్రబాబుదని విమర్శించారు. తన రాజకీయ స్వలాభం కుటిల రాజకీయాలు చేస్తున్న చంద్రబాబు ప్రజలు మరోసారి బుద్ధి చెప్పడమే కాకుండా టీడీపీని భూస్థాపితం చేయడం తథ్యమన్నారు. ప్రజల మద్దతు మళ్లీ వైఎస్సార్‌సీపీకేనని పేర్కొన్నారు.



నీటి ట్యాంకును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

ఎమ్మెల్యే దృష్టికి సమస్యలు

సీసీ రోడ్లు వేయాలని, మురుగు కాలువలు నిర్మించాలని గంగాపురం ప్రజలు ఎమ్మెల్యేను కోరారు. సమస్యలపై ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించారు.

తాగు నీటి ట్యాంకులు ప్రారంభం

మండలంలోని మార్జేపల్లె, గొర్రెలదొడ్డి గ్రామాల్లో నూతనంగా నిర్మించిన ఓహెచ్‌ఎస్‌ఆర్ తాగునీటి ట్యాంకులను ఎమ్మెల్యే వెంకటేగౌడ ప్రారంభించారు. గ్రామస్తుల వినతిపై స్పందించిన ఆయన జెజెపి గ్రాంట్స్ కింద నిధులు మంజూరు చేయించి, ఒక్కో ట్యాంకును రూ.11.76 లక్షలతో నిర్మించారు. కార్యక్రమంలో పార్టీ మండల కన్వీనర్ మోహన్‌రెడ్డి, ఎంపీపీ వెంకటరమణ, సర్పంచ్ రమణ, ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ రవికిరణ్, నాయకులు చంద్రప్ప, చలపతిరెడ్డి, శ్రీరాములురెడ్డి, గిరిరాజారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

మున్సిపాలిటీ అభివృద్ధికి కృషి



మాట్లాడుతున్న మున్సిపల్ చైర్మన్ అలీమ్‌బాషా, పక్కన కమిషనర్ నరసింహప్రసాద్

పుంగనూరు: మున్సిపాలిటీ పరిధిలోని 31 వార్డుల్లో అన్ని విధాలుగా మౌలిక వసతులు కల్పించి, అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతున్నట్లు మున్సిపల్ చైర్మన్ అలీమ్‌బాషా తెలిపారు. బుధవారం సాధారణ సమావేశాన్ని కమిషనర్ నరసింహప్రసాద్‌రెడ్డి నిర్వహించారు. ఈ సందర్భంగా అజెండాలోని అంశాలను సభ్యులు ఆమోదించారు. చైర్మన్ మాట్లాడుతూ పట్టణంలోని రాంనగర్, సూర్యనగర్‌లో వీధులు, కాలువలు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. అలాగే ఎంపీ మిథున్‌రెడ్డి ఆదేశాల మేరకు రాంనగర్ కాలనీలో మంచినీటి పైపులైన్లు ఏర్పాటు చేస్తున్నామన్నారు. సచివాలయల ద్వారా ప్రజలకు అవసరమైన సమస్యలను పరిశీలించి ఎప్పటికప్పుడు పరిష్కరిస్తున్నామని చెప్పారు. అలాగే ఎంపీ నిధులతో పట్టణంలో విద్యుత్‌లైన్లు, ట్రాన్స్‌ఫార్మర్లు, స్తంభాలు ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. ప్రమాదకరమైన లైన్లను శాంతినగర్‌లో తొలగించేందుకు సుమారు రూ.80 లక్షలు ఎంపీ మంజూరు చేయడం జరిగిందన్నారు. త్వరలోనే పనులు నిర్వహిస్తామని తెలిపారు. సమావేశంలో వైస్ చైర్మన్లు నాగేంద్ర, లలిత, డీఈఈ మహేష్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ వెంకటసుబ్బయ్య తదితరులు పాల్గొన్నారు.

నూతన కార్యవర్గం ఎంపిక



నూతన కార్యవర్గానికి సన్మానం

వి.కోట: పట్టణంలోని శ్రీ కన్యకాపరమేశ్వరీ ఆలయంలో బుధవారం ఆలయ నూతన కార్యకర్గం ఎంపిక చేశారు. అధ్యక్షుడిగా ధవనం భక్త, వైస్ ప్రెసిడెంట్‌గా దేవరాజు, కోశాధికారిగా లక్ష్మీనారాయణ, సెక్రటరీ గా సుబ్రమణ్యంను ఎంపిక చేసినట్లు కమిటీ సభ్యులు తెలిపారు. నూతన కార్యవర్గాన్ని కమిటీ సభ్యులు సన్మానించారు.

భూమిపూజ



భూమిపూజలో పెద్దిరెడ్డి, అధికారులు

సదుం: భట్టువారిపల్లె సమీపంలో విద్యుత్ ఉప రెవెన్యూ కేంద్ర కార్యాలయ భవన నిర్మాణానికి వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి పెద్దిరెడ్డి, జెడ్పీటీసీ సభ్యుడు సోమశేఖర్‌రెడ్డి, ఎంపీపీ ఎల్లప్ప, విద్యుత్ అధికారులతో కలసి బుధవారం భూమిపూజ చేశారు. సుమారు రూ.1.2 కోట్లతో నిర్మించనున్నట్టు వారు చెప్పారు. ఎస్‌ఈ కృష్ణారెడ్డి, డీఈ విజయన్, సివిల్ ఏడీ జగదీశ్వర్ నాయుడు, ఏడీఈ నరేంద్ర, ఏఈ చంద్రశేఖర్, నాయకులు వెంకటస్వామి, రమేష్‌రెడ్డి, నారాయణరెడ్డి, ఇమ్రాన్, ఎల్లారెడ్డి పాల్గొన్నారు.

పారదర్శకంగా పొదుపు సంఘాల నిర్వహణ

శాంతిపురం: మహిళా పొదుపు సంఘాలు, గ్రామ సమాఖ్యలు, మండల సమాఖ్యల ఆర్థిక లావాదేవీలు పూర్తి పారదర్శకంగా చేయాలని డీఆర్‌డీఏ పీడీ తులసి అన్నారు. వైఎస్ఆర్ క్రాంతిపథం సంఘమిత్రలకు ఆర్థిక సాక్షరతపై ఇస్తున్న శిక్షణలో బుధవారం ఆమె మాట్లాడారు. లావాదేవీల వివరాలను ప్రతి సభ్యురాలికీ తెలిసేలా సంఘమిత్రలు వ్యవహరించాలన్నారు. చిన్న పరిశ్రమల ఏర్పాటుకు ముందుకు వచ్చే మహిళలకు 35 శాతం రాయితీ ప్రభుత్వం ఇస్తోందన్నారు. అనంతరం ఆమె అబకలదొడ్డి సచివాలయాన్ని తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. డీపీఎంఓ నాగేశ్వరరావు, ఏరియా కో–ఆర్డినేటర్ చంద్రశేఖర్, ఏపీఎం గ్రీటా తదితరులు పాల్గొన్నారు.

మోటార్‌సైక్లిస్టులకు గాయాలు

రొంపిచెర్ల: అదుపు తప్పి ద్విచక్ర వాహనం బోల్తా పడడంతో ఇద్దరు తీవ్రంగా గాయపడిన సంఘటన తిరుపతి–మదనపల్లె జాతీయ రహదారిలో బుధవారం రాత్రి చోటు చేసుకుంది. ఎర్రావారిపాళ్యం మండలానికి చెందిన ప్రతాప్‌రెడ్డి (52), హరి(45) ద్విచక్ర వాహనంలో పీలేరు నుంచి వస్తుండగా బోనంవారిపల్లె వద్ద వారి బైక్ అదుపు తప్పి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో ఇద్దరూ తీవ్రంగా గాయపడ్డారు. స్థానికులు గమనించి 108 వాహనంలో పీలేరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

చావును వెంటబెట్టుకొచ్చాడు!

- ఉపాధి కల్పించిన వ్యక్తినే హతమార్చాడు
- వెస్ట్‌బెంగాల్ నుంచి నిందితుడిని తీసుకొచ్చింది హతుడే
- పోలీసుల విచారణలో వెల్లడి



హతుడు దయాల్



నిందితుడు రోనీ (ఫైల్)

పలమనేరు: వెస్ట్ బెంగాల్‌కు చెందిన ఇద్దరు భవన నిర్మాణ కార్మికులు సరదాగా మొబైల్‌లో గేమ్ ఆడుతూ.. ఆటలో తొండి చేస్తున్నాడని మాటామాటా పెరిగి ఓ యువకుడు మరో వ్యక్తిని ఇనుపరాడ్‌తో తలపై కొట్టడంతో మృతి చెందిన విషయం తెలిసిందే. ఈ హత్యకు దారితీసిన పరిస్థితులు పోలీసుల విచారణలో బుధవారం వెలుగుచూశాయి. వెస్ట్ బెంగాల్‌కు చెందిన కొన్ని కుటుంబాలు పట్టణ సమీపంలోని కోర్టు వద్ద భవన నిర్మాణ పనులు చేస్తూ వాటిల్లోనే ఉంటున్నాయి. ఇందులో దయాల్ సర్కార్ కుటుంబం ఒకటి. అతడు భార్య, కుమారుడితో కొంతకాలంగా ఇక్కడే పనులు చేస్తున్నారు. 20 రోజుల క్రితం దయాల్ తన స్వగ్రామానికి వెళ్లాడు. అక్కడ ఆవారాగా తిరుగుతున్న మహ్మద్ రోనీ ఇస్లాంను ఇక్కడికి తీసుకొచ్చి పనిలో పెట్టుకున్నాడు. ఉపాధి కల్పిద్దామని తన వెంట తీసుకొచ్చిన యువకుడే మొబైల్ గేమ్ ఆడుతూ ఆవేశంలో దయాల్‌ను పొట్టనపెట్టుకోవడం గమనార్హం! హతుని కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు సీఐ చంద్రశేఖర్ కేసు నమోదు చేశారు. పరారీలో ఉన్న నిందితుడిని త్వరలోనే అరెస్ట్ చేస్తామని తెలిపారు. మరోవైపు పలమనేరు పరిసరాల్లో ఉపాధి కోసం ఇతర రాష్ట్రాల నుంచి వచ్చిన వారి వివరాలను సేకరించాలని డీఎస్పీ సుధాకర్‌రెడ్డి పోలీసులను ఆదేశించారు.

డీఎల్‌ఎఫ్‌-11 విజేత విష్ణూస్ కింగ్స్



ట్రోఫీ అందుకుంటున్న విజేత జట్టు క్రీడాకారుడు

గుడుపల్లె: పీఈఎస్ కళాశాలలో ఏటా నిర్వహించే డీఎల్‌ఎఫ్ క్రికెట్ టోర్నమెంట్ 11వ సీజన్ విజేతగా విష్ణూస్ కింగ్స్ నిలిచినట్లు ప్రిన్సిపల్ హెచ్‌ఆర్ కృష్ణారావు తెలిపారు. బుధవారం జరిగిన ఫైనల్లో సాగర్ స్ట్రైకర్స్‌పై విష్ణూస్ కింగ్స్ గెలిచిందని ఆయన చెప్పారు. బెస్ట్ ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్‌గా శంకర్, మ్యాన్ ఆఫ్ ద టోర్నీగా భరత్‌రామ్, బెస్ట్ బౌలర్‌గా శ్రావణ్, బెస్ట్ బ్యాట్స్‌మెన్‌గా భరత్‌రామ్ ఎంపికైనట్లు ఆయన తెలిపారు.

ప్రభుత్వ బడుల్లో చేర్చాలని...

పలమనేరు: ప్రభుత్వ బడుల్లో పిల్లల్ని చేర్పించాలని కోరుతూ బుధవారం పట్టణంలోని గంటావూరు ఉర్దూ పాఠశాల ఉపాధ్యాయులు ఇంటింటా ప్రచారం చేశారు. ఎన్‌రోల్‌మెంట్ డ్రైవ్ నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ బడుల్లో చదివిస్తే కలిగే ప్రయోజనాలను వివరించారు. ఐదేళ్లు నిండిన పిల్లలను తల్లిదండ్రులు ప్రభుత్వ పాఠశాలలో చేర్పించి అడ్మిషన్లు పొందారు. హెచ్‌ఎం, టీచర్లు పాల్గొన్నారు.

భీమేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు

పుంగనూరు: మండలంలోని భీమగానిపల్లెలో గల శ్రీజ్ఞానప్రసన్న సమేత శ్రీభీమేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు బుధవారం ఘనంగా నిర్వహించారు. ఉత్సవాలు ఈనెల 8వ తేదీ వరకు వైభవంగా నిర్వహిస్తున్నట్లు ఆలయ చైర్మన్ జనార్ధన్ తెలిపారు. ప్రతిరోజు ఆలయంలో వివిధ కార్యక్రమాలను నిర్వహిస్తామని పండితులు రమేష్ దీక్షితులు, మంజునాథ్ దీక్షితులు చెప్పారు. కార్యక్రమంలో ప్రతిఒక్కరూ పాల్గొని స్వామివారి కృపకు పాత్రులు కావాలని కోరారు.

వేడుకగా ఆలయ వార్షికోత్సవం



సదుం: మండలంలోని శ్రీరామలింగ చౌడేశ్వరీదేవి ఆలయ వార్షికోత్సవం బుధవారం వైభవంగా జరిగింది. ఉదయం అభిషేకాలు, పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకుడు రఘునాథరావు ఆధ్వర్యంలో ప్రత్యేక అలంకరణ చేపట్టగా భక్తులు విశేషసంఖ్యలో దర్శించుకున్నారు. భక్తులకు అన్నదానం చేశారు. రాత్రి అమ్మవారికి మహిషాసుర మర్దిని అలంకరణ చేపట్టారు. అనంతరం అమ్మవారిని పుష్పపల్లకిపై అలంకరించి ఊరేగించారు.

'బాబు' తప్పుడు హామీలను నమ్మొద్దు



లబ్ధిదారులకు సంక్షేమ బావుటా బుక్‌లెట్‌ను ఇస్తున్న ఎమ్మెల్సీ భరత్

- 'గడప గడపకు మన ప్రభుత్వం'లో ఎమ్మెల్సీ భరత్

రామకుప్పం: టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు తప్పుడు హామీలను ప్రజలు నమ్మరాదని, హామీలతో ప్రజలను వంచించడంలో ఆయనో ఘనుడని చిత్తూరు ఎమ్మెల్సీ భరత్ అన్నారు. మండలంలోని బందార్లపల్లె పంచాయతీ బగళనత్తంలో బుధవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని ఎమ్మెల్సీ నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అమలు చేస్తున్న నవరత్నాల పథకాల గురించి వివరించారు. అలాగే ఆయా కుటుంబాలు పొందిన సంక్షేమ పథకాల లబ్ధిని వివరించారు. ఆయన మాట్లాడుతూ, రానున్న ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని చంద్రబాబు నాయుడు అమలు కాని హామీలిస్తూ, ప్రజలను దగా చేయడానికి సిద్ధమయ్యారని మండిపడ్డారు. 2014 నాటి టీడీపీ మేనిఫెస్టోను ప్రజలు చూస్తే ఇట్టే బోధపడుతుందన్నారు. ఇప్పుడు తమ ప్రభుత్వం అమలు చేస్తున్న నవరత్నాలను చంద్రబాబు కాపీ కొట్టి, హామీలుగా ప్రకటించడం చూసి ప్రజలు విస్తుపోతున్నారన్నారు. ఆంధ్ర ప్రదేశ్‌లో ప్రభుత్వం అమలు సంక్షేమ పథకాల మూలాన పేదలు, బడుగు, బలహీన వర్గాల ఆర్థిక స్థితిగతులు, జీవన ప్రమాణాలు మెరుగు పడ్డాయని, ఇతర రాష్ట్రాలు సైతం మన పథకాలపై ఆసక్తి చూపుతుండడం చూస్తే మన రాష్ట్రం ఎంత ఆదర్శంగా ఉందో తెలుస్తోందన్నారు. ప్రజలు నివేదించిన సమస్యలను సంబంధిత అధికారులు పరిష్కరించాలని, అలాగేఅర్హులకు సంక్షేమ పథకాలు సకాలంలో అందేలా చూడాలని ఆదేశించారు.

రైతులకు వేరుశనగ విత్తనాల పంపిణీ

బందార్లపల్లె పంచాయతీ పరిధిలోని రైతులకు బుధవారం స్థానిక రైతు భరోసా కేంద్రంలో ఎమ్మెల్సీ భరత్ వేరుశనగ విత్తనకాయలను పంపిణీ చేసి మాట్లాడారు. విత్తనాలు కావాల్సిన రైతులు పట్టాదారు పాసుపుస్తకం,ఆధార్ కార్డు, ఫోన్ నంబరుతోక రైతు భరోసా కేంద్రంలో సంప్రదించాలని మండల వ్యవసాయాధికారి అమృత తెలిపారు. కార్యక్రమంలో మండల వైఎస్సార్ సీపీ కన్వీనర్ విజలాపురం బాబురెడ్డి, జెడ్పీటీసీ నితిన్ రెడ్డి, ఎంపీపీ సుబ్రమణ్యం, పార్టీ కో–కన్వీనర్ చంద్రారెడ్డి, సర్పంచ్ రాజ్‌గోపాల్, ఎంపీటీసీ సభ్యురాలు సౌమ్య, పార్టీ ప్రచార కార్యదర్శి కేశవరెడ్డి, నేతలు రామకృష్ణారెడ్డి, సురేంద్రరెడ్డి, శ్రీనివాసులు రెడ్డి, నరేంద్ర రెడ్డి, నాగరాజు రెడ్డి, వార్డు సభ్యులు, అధికారులు పాల్గొన్నారు.

రైతుల సంక్షేమానికి ప్రాధాన్యం



శాంతిపురం : సొన్నెగానిపల్లెలో విత్తనాలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్సీ భరత్

- వేరుశనగ విత్తన కాయల పంపిణీలో ఎమ్మెల్సీ భరత్

శాంతిపురం: రైతాంగం సంక్షేమానికి వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తోందని ఎమ్మెల్సీ భరత్ పునరుద్ఘాటించారు. రాయితీపై ప్రభుత్వం మంజూరు చేసిన వేరుశనగ విత్తనాలను బుధవారం సొన్నేగానిపల్లె, దండికుప్పం ఆర్బీకేలలో రైతులకు ఎమ్మెల్సీ పంపిణీ చేసి మాట్లాడారు.అధికార యంత్రాంగం మండలానికి మొత్తం 6,200 బస్తాల విత్తనపు కాయలను కేటాయించిందని చెప్పారు. 30 కిలోల వేరుశనగ బస్తా సబ్సిడీపై రూ 1,674లకే ఇస్తోందన్నారు. గురువారం నుంచి అన్ని ఆర్బీకేలలో విత్తనాల పంపిణీ చేస్తామని వ్యవసాయాధికారి అప్పాజి తెలిపారు. కార్యక్రమంలో రెస్కో వైస్ చైర్మన్ కోదండరెడ్డి, జెడ్పీటీసీ సభ్యుడు శ్రీనివాసులు, రెస్కో మాజీ చైర్మన్ చక్రపాణిరెడ్డి, కృష్ణమూర్తి, సుబ్బరాజులు, స్థానిక సర్పంచులు మంజునాథరెడ్డి, పుష్ప, ఎంపీటీసీ బాబురెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వేరుశనగ విత్తనాల పంపిణీ

పులిచెర్ల(కల్లూరు): మండలంలోని దిగువపోకలవారిపల్లె పంచాయతీలో బుధవారం రైతులకు సబ్సిడీపై వేరుశనగ విత్తనాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో వెంకటదాసరపల్లె ఎంపీటీసీ పోకల చంద్ర, సర్పంచ్‌లు ఉమాదేవి, సరోజమ్మ, మాజీ ఎంపీటీసీ శ్రీనివాసులు, గంగయ్య, వెంకట రెడ్డెప్ప, చంగల్‌రాయులు, నాగయ్య, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

పలమనేరు: ప్రభుత్వం రాయితీపై ఇస్తున్న వేరుశనగ విత్తనాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని జరావారిపల్లె సర్పంచ్ వనితకళ కోరారు. బుధవారం గ్రామ రైతుభరోసా కేంద్రంలో విత్తన కాయలను ఆమె పంపిణీ చేసి మాట్లాడారు. కార్యక్రమంలో రైతులు, ఆర్‌బీకే సిబ్బంది పాల్గొన్నారు.

రైతుల కోసమే సబ్సిడీ విత్తనాలు

రొంపిచెర్ల: పేదల కోసమే ప్రభుత్వం సబ్సిడీ విత్తనాలను పంపిణీ చేస్తుందని బండకిందపల్లె గ్రామ సచివాలయ కన్వీనర్ హరికృష్ణారెడ్డి అన్నారు.



దిగువపోకలవారిపల్లె సచివాలయంలో విత్తన కాయలు పంపిణీ చేస్తున్న పోకల చంద్ర



పలమనేరు : వేరుశనగ విత్తనాలను పంపిణీ చేస్తున్న సర్పంచ్ వనితకళ



బండకిందపల్లెలో సబ్సిడీ విత్తనకాయలను పంపిణీ చేస్తున్న కన్వీనర్ హరికృష్ణారెడ్డి

ఆయన బుధవారం రైతు భరోసా కేంద్రంలో రైతులకు సబ్సిడీ విత్తనకాయలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం జగన్‌మోహన్ రెడ్డి ఇచ్చిన మాట ప్రకారం ఖరీఫ్ సీజన్‌కు ముందుగానే రైతులకు విత్తనాలను మంజూరు చేశారని తెలిపారు. సచివాలయ పరిధిలో 60 హెక్టార్లలో వేరుశనగ పంటను రైతులు సాగు చేస్తున్నారని తెలిపారు. వీరికి 450 బస్తాల విత్తనాలను ఇస్తున్నామని తెలిపారు. సబ్సిడీ విత్తనాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో రైతు భరోసా కేంద్రం ఇన్‌చార్జ్ శ్రావణి, వైఎస్సార్‌సీపీ నాయకులు కమలాకర్ రెడ్డి, అశోక్‌రెడ్డి, చంద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వివిధ శాఖల అధికారులను పిలవరా?



మున్సిపల్ సమావేశం నిర్వహిస్తున్న చైర్ పర్సన్ పవిత్ర, హాజరైన కౌన్సిలర్లు

-పలమనేరు మున్సిపల్ సమావేశంలో ధ్వజమెత్తిన సభ్యులు

పలమనేరు: మూడునెలలకోసారి నిర్వహించే మున్సిపల్ సమావేశానికి సంబంధిత శాఖల అధికారులను పిలవకపోవడం ఏమిటని మున్సిపల్ కౌన్సిలర్లు కోదండరామయ్య, హైదర్ మున్సిపల్ కమిషనర్‌ను ప్రశ్నించారు. బుధవారం మున్సిపల్ సాధారణ సమావేశం మున్సిపల్ చైర్‌పర్సన్ పవిత్ర అధ్యక్షతన స్థానిక మున్సిపల్ సమావేశ మందిరంలో నిర్వహించారు. పలు సమస్యలపై సభ్యులు ధ్వజమెత్తారు. పలు శాఖలకు సంబందించిన అంశాలపై చర్చించే సమయంలో ఆయా శాఖల అధికారులు ఎందుకు రావడం లేదని, మీరు పిలవడం లేదా? లేక వారు రావడం లేదా? చెప్పాలని నిలదీశారు. పట్టణంలో వీధి కుక్కల సమస్య ఎక్కువగా ఉందని, ఎక్కడ పడితే అక్కడ చికెన్ వ్యర్థాలను పడేస్తున్నా పట్టించుకోరా? అని మున్సిపల్ వైస్ చైర్మన్ కిరణ్‌కుమార్ ప్రశ్నించారు. కుక్కలను పట్టి ఇతర ప్రాంతాల్లో వదిలిపెట్టేందుకు త్వరలోనే చర్యలు తీసుకుంటామని కమిషనర్ కిరణ్‌కుమార్ బదులిచ్చారు. అలాగే పట్టణంలోని చికెన్, మటన్ షాపుల నిర్వాహకులకు నోటీసులు జారీ చేస్తామన్నారు. గొబ్బిళ్ల కోటూరులో సీసీ రోడ్డు వేయాలని మూడేళ్లుగా కోరుతున్నా పట్టించుకోవడం లేదని టీడీపీ కౌన్సిలర్ శారద ఆవేదన వ్యక్తం చేశారు. జిల్లాలోనే ఆదర్శ మున్సిపాలిటీగా పలమనేరును తీర్చిదిద్దేందుకు తమ పాలకమండలి కృషి చేస్తోందని మున్సిపల్ చైర్‌పర్సన్ పేర్కొన్నారు. ఇంతటి వేసవిలోనూ ఎక్కడ తాగునీటి సమస్య లేకుండా చేశామని, పట్టణంలో 90శాతం వీధులకు బీటీ, సీసీ రోడ్లను వేశామన్నారు. పార్టీలతో సంబంధం లేకుండా సమస్యల పరిష్కారానికి తమ కౌన్సిల్ చొరవ చూపుతుందన్నారు.

11 అంశాలకు పాలకమండలి ఆమోదం

సమావేశంలో పదకొండు అంశాలను కౌన్సిల్ ఆమోదించింది. ఇందులో సీసీ రోడ్ల నిర్మాణాలు, మంచినీటి పైపులైను పనులు, కార్యాలయ సామగ్రి కొనుగోలు..ఇత్యాది అంశాలు ఉన్నాయి. సమావేశంలో మున్సిపల్ వైస్ చైర్మన్లు, కౌన్సిలర్లు, కో–ఆప్షన్ సభ్యులు, మున్సిపల్ వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

పొగాకు వాడకం ఆరోగ్యానికి హానికరం



రొంపిచెర్లలో..



కల్లూరులో వైద్యసిబ్బంది ర్యాలీ



సదుం: ర్యాలీ నిర్వహిస్తున్న ఆరోగ్య సిబ్బంది



బైరెడ్డిపల్లెలో...

రొంపిచెర్ల: ప్రజలు పొగాకు వాడకానికి దూరంగా ఉండాలని ప్రాథమిక ఆరోగ్య వైద్యాధికారి రాజ అన్నారు. ప్రపంచ పొగాకు దినోత్సవం సందర్భంగా పురవీధుల్లో ర్యాలీ నిర్వహించారు. పొగాకు వాడకం వల్ల క్షయ, క్యాన్సర్, గుండెపోటు, నోటి క్యాన్సర్, కాలేయ వ్యాధులు వస్తాయని తెలిపారు. పొగ పీల్చడం వల్ల పక్కన ఉన్నవారికి కూడా వ్యాధులు వచ్చే అవకాశం ఉందన్నారు. దీన్ని దృష్టిలో పెట్టుకుని పొగాకు వాడకానికి దూరంగా ఉండాలని సూచించారు. పురవీధుల్లో నినాదాలు చేస్తూ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో జూనియర్ డాక్టర్ దినేష్ కుమార్ నాయక్, సీహెచ్ఓ కాంతమ్మ, మండల ఆరోగ్య విద్యాధికారి రాజేశ్వరి, పీహెచ్ఎన్ పార్వతమ్మ, ఎంపీహెచ్ఎస్ పంకజ, ఎంఎల్‌హెచ్‌పీలు, ఆరోగ్య కార్యకర్తలు పాల్గొన్నారు.

కల్లూరులో..

పులిచెర్ల(కల్లూరు): పొగాకు వాడకం ప్రాణాలకు హానికరమని కల్లూరు పీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ జానకీరావు అన్నారు. ప్రపంచ పొగాకు దినోత్సవంపై బుధవారం కల్లూరులో వైద్యసిబ్బంది ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో డాక్టర్లు పుష్ప,కుముదవల్లీ, హరిప్రియ, ఏఎన్‌ఎంలు, ఆశావర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

పొగాకుతో ప్రాణాపాయం

సదుం: పొగాకు వాడకంతో అనేక వ్యాధులు వచ్చే అవకాశం ఉందని చెరుకువారిపల్లె పీహెచ్‌సీ డాక్టరు చరణ్ తెలిపారు. ప్రపంచ పొగాకు వ్యతిరేక దినోత్సవం సందర్భంగా మండల కేంద్రంలో బుధవారం వైద్యసిబ్బంది అవగాహన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఆరోగ్య సిబ్బంది ఉదయభాస్కర్, నీలకంఠ, భాగ్యలక్ష్మీ, జానకి, సీహెచ్ఓ శ్రావణి, విద్య, రషీద్ పాల్గొన్నారు.

బైరెడ్డిపల్లెలో..

బైరెడ్డిపల్లె : పొగాకు ఉత్పత్తులను వాడరాదని వైద్యాధికారులు విజయ్‌చంద్ర, అరుణ్‌కుమార్ యువతకు విజ్ఞప్తి చేశారు. మండలంలోని బైరెడ్డిపల్లె, తీర్థం పీహెచ్‌సీ పరిధిలో బుధవారం ప్రపంచ పొగాకు వ్యతిరేక దినోత్సవ ర్యాలీ నిర్వహించారు. పొగాకు ఉత్పత్తుల వాడకం మూలాన క్యాన్సర్, బీపీ, షుగర్, శ్వాసకోశ వ్యాధులు, గుండె జబ్బులు వస్తాయన్నారు. కార్యక్రమంలో హెల్త్ ఎడ్యుకేటర్లు సావిత్రమ్మ, శ్రీదేవి, ఆరోగ్యసిబ్బంది పాల్గొన్నారు.